

అన్నభాగ్యం ఎప్పుడో..?

బియ్యం సరఫరాకు కేంద్రం నిరాకరణ
ఫలించని కొనుగోలు ప్రయత్నాలు
కేంద్రమంత్రిని కలవనున్న మునియప్ప
నగదు బదిలీ ప్రారంభించి ఏడాది




బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబం ఎటువంటి చింత లేకుండా అన్నం తినాలని భావించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య 'అన్నభాగ్య' గ్యారెంటీని అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్న భాగ్య ద్వారా ప్రతి బీపీఎల్‌కార్డు దారుడికి నెలకు 5 కిలోల బియ్యం అందించాలని నిర్ణయించింది. ఎన్నికల హామీలో ప్రకటించినట్టుగానే ప్రభు త్వం ఏర్పడిన వెంటనే అన్న భాగ్య పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర పౌర ఆహార సరఫరాల విభాగం నుంచి అదనపు కోటా బియ్యం కొనుగోలుకు ప్రతి పాదనలు పంపారు. రాష్ట్రప్ర భుత్వం అమలు చేస్తున్న అన్నభాగ్య పథకానికి అవసరమై నంత బియ్యం సమకూ ర్చలేమని కేంద్రం తేల్చి చెప్పింది. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో భిన్న మైన అభిప్రాయాలు కొనసా గాయి. కారణం ఏదైనా రాష్ట్రా నికి కేంద్రప్రభుత్వం నుంచి అద నంగా బియ్యం ఇచ్చేందుకు నిరాక రించింది. కొవిడ్ కాలంలో దేశమం తటా ప్రతి పేద కుటుంబంలోని సభ్యుడికి 5 కిలోల బియ్యాన్ని సమకూ ర్చారు. రెండేళ్ల తర్వాత కొవిడ్ కనుమ రుగైనా ఆ తర్వాత పరిణామాలు కొనసా గుతున్నాయని, కేంద్రం 5 కిలోల బియ్యం పంపిణీని యథావిధిగా అంది స్తోంది.



గత ఏడాది అన్నభాగ్య పథకం ప్రారంభంలో సిద్దరామయ్య, డీకే శివకుమార్, మునియప్ప (ఫైల్)

నగదు బదిలీ ప్రారంభించి ఏడాది

కేంద్రం అందించే 5 కిలోలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 5 కిలోలు కలిపి మొత్తం 10 కిలోలు ఇస్తామని ఏడాదిక్రితం ప్రభుత్వం ప్రకటించింది. కేంద్రం అదనపు కోటాను నిరాకరించడంతో ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలో వెనుకడుగు వేయరాదని ప్రత్యామ్నాయంగా నగదు బదిలీకి శ్రీకారం చుట్టారు. 2023 జూలై 1 నుంచి అన్నభాగ్య లబ్ధిదా రులకు నేరుగా నగదు బదిలీ ప్రారంభించారు. ఒక కిలో బియ్యం రూ.34గా నిర్ణయించి నెలవారీ రూ.170 చొప్పున పంపిణీ చేస్తున్నారు. బీపీఎల్, అంత్యోదయ తదితర కార్డుదారులకు 5 కిలోల అదనంగా ఇవ్వాలంటే నెలసరి రాష్ట్రానికి 2.28 లక్షల కిలోల బియ్యం అవసరం ఉంటుంది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) నిర్ణయించిన కిలో రూ.34 చొప్పున అయితే రూ.10,092 కోట్లు అవసరం కానుంది. రాష్ట్రంలో 4.02 కోట్ల బీపీఎల్ లబ్ధిదారులు ఉండగా వారికి నెలవారీ రూ.170 చొప్పున నగదు బదిలీ చేస్తున్నారు. 2023 జూలై నుంచి 2024 జూన్ దాకా రూ. 8,611.55 కోట్లు ఖర్చు చేశారు.



ఫలించని బియ్యం కొనుగోలు ప్రయత్నాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2023 మే నెల చివరలో ఏర్పడింది. జూన్‌లో అన్నభాగ్య పథకం ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఫుడ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా బియ్యం సమకూర్చుకునేందుకు సిద్ధమయ్యారు. తొలుత బియ్యం విడుదల చేసేందుకు సుముఖత వ్యక్తం చేసినా ఆ తర్వాత వెంటనే నసేమిరా అంటూ ఎఫ్‌సీఐ షాక్ ఇచ్చింది. ప్రత్యామ్నాయంగా బియ్యం కొనుగోలుకు ప్రయత్నించారు. అపారమైన అనుభవం కల్గిన పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప భిన్నమైన కోణాలలో ప్రయత్నాలు జరిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతోనూ ప్రయత్నాలు చేశారు. వారు బియ్యం ఇచ్చేందుకు సిద్ధం అంటూనే ఎఫ్‌సీఐ నిర్ణయించిన ధర కిలో రూ.34 కంటే అదనంగా కోట్ చేశారు. దీనికితోడు రవాణా సంబంధం లేదని తేల్చారు. మరోవైపు పంజాబ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు కూడా బియ్యం ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. కానీ సుదూరం కావడంతో రవాణా భారం అత్యధికమవుతుదని వెనుకడుగు వేశారు. నెలవారీ 2.2 లక్షల టన్నుల బియ్యం అవసరం అవుతుంది. ఎఫ్‌సీఐ ద్వారా కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలుకు సిద్ధమైతే కనీసం నెలకు వెయ్యి కోట్ల రూపాయలు అదనంగా భరించాల్సి ఉంటుంది. కొందరు ప్రైవేట్ వ్యాపారులు బియ్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చారు. కానీ వారు మధ్యలో సాధ్యం కాదని చెతులెత్తేస్తే సర్కార్‌కు చెడ్డపేరు వస్తుందని వెనుకడుగు వేశారు.

కేంద్రమంత్రి జోషి ద్వారా మరో ప్రయత్నం

కేంద్ర పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రిగా రాష్ట్రానికి చెందిన ప్రహ్లాద్‌జోషి కావడంతో మరో ప్రయత్నం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సన్నద్ధమైంది. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర పౌర ఆహారసరఫరాలశాఖ మంత్రి మునియప్ప ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర పరిస్థితి కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషికి సమగ్రంగా తెలుసు అని, కేంద్రం ఎఫ్‌సీఐ ద్వారా అదనంగా బియ్యం విడుదల చేస్తే వచ్చే నెల నుంచే అన్నభాగ్య గ్యారెంటీకి లబ్ధిదారులకు 10 కిలోల బియ్యం అందిస్తామని ప్రకటించారు. ఆయన త్వరలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషిని భేటీ అయ్యే అవకాశం ఉంది. ఇరువురి మధ్య చర్చలు ఏ విధంగా సత్ఫలితాలు ఇస్తాయనేది వేచి చూడాల్సి ఉంది.

మార్పులు లేవు..!

సీఎం సిద్దరామయ్యే... డీసీఎం డీకే ఒక్కరే
వివాదాలకు దూరంగా ఉండాలి
రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు హైకమాండ్ హెచ్చరిక






బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి మార్పు, అదనపు ఉపముఖ్యమంత్రుల డిమాండ్ అంశాలపై సాగుతున్న గందరగోళానికి అధిష్ఠానం చెక్ పెట్టింది. రాష్ట్రంలో ఎటువంటి వివాదాలు ఉండరాదని, ఏ విధమైన మార్పులకు తావు లేదని యథావిధిగా పాలన సాగుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. రాజకీయ కారణాల కోసం, అస్తిత్వం కోసం కొందరు లేవనెత్తిన అంశాలను పరిశీలిస్తున్నామని రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాష్ట్ర పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. స్థానిక సంస్థలు, బెంగళూరు మహానగర పాలికె కీలక ఎన్నికలపై దృష్టి సారించాలని, రాష్ట్రంలో గందరగోళానికి కారణమైన అంశాల ప్రస్తావన సాగుతోందని, డీసీఎం డీకే శివకుమార్ ఇటీవలి ఢిల్లీ పర్యటనలో పలువురు నేతలను కలసి వివరించారు. ఈ మేరకు స్పందించిన అధిష్ఠానం తీవ్రంగా హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదా ఇతరత్రా అంశాలపై ఎటువంటి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నా అగ్రనేతలతో చర్చిస్తామని తేల్చి చెప్పారు. బహిరంగంగా వ్యాఖ్యలు చేసి పార్టీకి నష్టం కలిగించేవారిని హెచ్చరించినట్టు తెలుస్తోంది. కొందరు ముఖ్యనేతలు తమకు నచ్చిన నేతలకు అండగా ఉండేలా ఇతరులపై ద్వేషపూరితంగా మాట్లాడడం సరికాదని సూచించారు. ముఖ్యమంత్రి మార్పు అంశం ప్రస్తావిస్తుంటే పాలనపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం సిద్దరామయ్య ఇటీవల ఢిల్లీ పెద్దలకు వివరించిన అంశాలను అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. అనుకూల, వ్యతిరేక చర్చలు వద్దంటూ హెచ్చరించారు. తదుపరి ఇదే తరహాలో ఆరోపణలు చేస్తే పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు.

కేంద్రమంత్రికి ఆ అవకాశం లేదు

రాష్ట్ర అధికారులతో సమావేశం నిర్వహించలేరు
హోంశాఖ మంత్రి పరమేశ్వర్



బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి రాష్ట్ర అధికారులతో కలసి సమావేశం నిర్వహించే అవకాశం లేదని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తెలిపారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి శుక్రవారం మండ్యలో నిర్వహించిన జనతాదర్శన్‌కు జిల్లా అధికారులు గైర్హాజరు అయ్యారని జరుగుతున్న అంశంపై హోంమంత్రి స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అధికారులతో సమావేశం నిర్వహించే అవకాశం లేదని కుమారస్వామికి తెలుసని, దిశా నిర్దేశం చేసే సమావేశాలు జరిపి సలహాలు ఇవ్వవచ్చు అన్నారు. గతంలో ఎంపీ డీకే సురేశ్ సమీక్షలు జరిపినప్పుడు కొంతమంది అధికారులు మాత్రమే వెళ్లేవారన్నారు. వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి ఈ అంశంపై స్పందిస్తూ కేంద్రమంత్రి సమీక్షలు జరపడం కాదని, రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లను తీసుకురావాలని పేర్కొన్నారు. అధికారులు జనతాదర్శన్‌కు రాలేదని ఆరోపించడం కేంద్రమంత్రికి తగదన్నారు.



చిరుతను పట్టుకునేందుకు మాటువేసిన అటవీశాఖ అధికారులు

చిరుత కలకలం

ముగ్గురు వ్యక్తులపై దాడి
పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారుల యత్నం
కర్రలు, రాళ్లతో దాడి చేసి చంపిన గ్రామస్థులు


రాయచూరు, జూలై 7 : జిల్లాలోని దేవదుర్గ తాలూకా కమదాళ గ్రామ సమీపంలోని గుట్టపై ఉన్న చిరుత కలకలం సృష్టించింది. ఆదివారం వేకువజామున బహిర్భూమికి వెళ్లిన గ్రామానికి చెందిన యువకుడు రంగప్ప, చిరుతను గమనించి వెంటనే గ్రామంలోకొచ్చి సమాచారాన్ని తెలిపాడు. దీంతో కొందరు వ్యక్తులు కర్రలతో అక్కడికి వెళ్లి శబ్దాలు చేస్తూ, ఈలలు వేస్తూ గుట్టదగ్గరి చేరుకోవడంతో ఒక్కసారిగా బయటికొచ్చిన చిరుత మల్లన్న (42), రంగనాథ (29), హనుమేశ్(35)పై దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు వ్యక్తులను దేవదుర్గ తాలూకా ఆస్పత్రిలో చేర్పించారు. వెంటనే చిరుత తిరిగి గుట్టలోకి చేరుకోగా గ్రామస్థులందరు ఒక్కసారిగా గుంపులు గుంపులుగా చేరుకుని శబ్దాలు, ఈలలు వేయడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని చిరుతను పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికి చిక్కలేదు. పెద్ద సంఖ్యలో జనం గుట్టను చుట్టుముట్టి ఉండడంతో మూడునాల్గుసార్లు బయటికొచ్చేందుకు ప్రయత్నించిన చిరుత.. సమీపంలో ఉన్న వారి పై దాడికి దిగడంతో గ్రామస్థులంతా కలిసి కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో చిరుత మృతి చెందింది. చిరుత కలకలంరేపిన విషయాన్ని తెలుసుకున్న దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ అక్కడికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. అనంతరం గాయపడి చికిత్స పొందుతున్న వారిని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్న ఆమె క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని, అవసరమైతే జిల్లా కేంద్రానికి తరలించాలని సూచించారు. కమదాళ గుట్ట వద్ద చిరుత దాడికి దిగిన నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామస్థులు అటువైపు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు.



కర్రలు,రాళ్లతో దాడి చేసి చిరుతను చంపిన గ్రామస్థులు

జలాశయాలకు జలకళ


భారీ వర్షాలతో గణనీయంగా పెరిగిన నీటిమట్టం
తీరనున్న తాగు, సాగునీటి సమస్య



హేమావతి పరవళ్లు



కబిని కళకళ



కేఆర్‌ఎస్ డ్యాం

బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి)

ఏడాది కాలంగా వెలవెలబోయిన జలాశయాలకు కళ వచ్చింది. కేరళ రాష్ట్రంలో నిరంతరంగా వర్షాలు కురుస్తుండడం, మరోవైపు కావేరి నదికి అనుబంధమైన కొడగు, పశ్చిమ కనుమలలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో కావేరి జలాశయాలలో నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. కావేరి నదికి అనుబంధమైన భారీ ప్రాజెక్టు కృష్ణరాజసాగర్ (కేఆర్‌ఎస్)లో ఆదివారం నాటికి నీటిమట్టం 102 అడుగులకు చేరింది. వర్షం కొనసాగుతుండడంతో ఇన్‌ఫ్లో పెరుగుతూ వస్తోంది. గత ఏడాది ప్రాజెక్టుల్లో తగినంత నీరు లేకపోవడంతో కాలువలకు వదలలేదు. ప్రస్తుతం వంద అడుగుల నీరు లక్ష్యం సాధ్యం కావడంతో కాలువలకు నీరు విడుదలకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి 15రోజులపాటు కాలువలకు నీరు విడుదల చేయనున్నారు. ఇన్‌ఫ్లోను బట్టి ఆ తర్వాత నీటి విడుదల నిర్ణయం తీసుకోనున్నారు. కేఆర్‌ఎస్ గరిష్ట నీటిమట్టం 124.80 అడుగులు కాగా ప్రస్తుతం 102 అడుగులకు చేరింది.

కబిని భర్తీకి 3 అడుగులే

కబిని జలాశయం భర్తీ అయ్యేందుకు 3 అడుగులు మాత్రమే ఉంది. కబిని గరిష్ట మట్టం 22.84 అడుగులు కాగా ప్రస్తుతం 22.81 అడుగులకు చేరింది. జలాశయానికి 7,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 2వేల క్యూసెక్కులను సుభాష్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా నదికి విడుదల చేస్తున్నారు. గడిచిన పదేళ్లలో జూలై మొదటి వారంలో కబిని భర్తీ కావడం ఇది రెండో సారి. 2020 జూలై 4వ తేదీన జలాశయం నిండింది. జలాశయం సామర్థ్యం 19.52 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.50 టీఎంసీల నీరు ఉంది. బెంగళూరు, చామరాజనగర జిల్లాలకు తాగునీటి కోసం 2వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇక హేమావతి జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో ఉంది. గరిష్ట నీటిమట్టం 117 అడుగులు కాగా ప్రస్తుతం 89.4 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 8,447 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 250 క్యూసెక్కులుగా ఉంది. ఇక హారంగి జలాశయం గరిష్ట నీటిమట్టం 129 అడుగులు కాగా ప్రస్తుతానికి 115.87 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 5,048 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

జ్యోతిబసు (జయంతి)



పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పాటు కొనసాగి దేశంలో అత్యధికకాలం సీఎంగా పనిచేసిన రికార్డు సొంతం చేసుకున్న జ్యోతిబసు 1914 జూలై 8న కోల్కత్తాలో జన్మించారు. కమ్యూనిస్టు మార్క్సిస్ట్ (సీపీఎం) పార్టీకి చెందిన ఆయన 1977 నుంచి 2000 వరకు వరుసగా ఐదుసార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. అంతకు ముందు ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. సీపీఎం పోలిట్‌బ్యూరో నిర్ణయం వల్ల 1996లో ప్రధానమంత్రి అయ్యే అవకాశం కోల్పోయారు. రాజకీయాల్లోకి రాకముందు ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2010 జనవరి 17న కన్నుమూశారు.

సౌరవ్ గంగూలీ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ సౌరవ్ గంగూలీ 1972 జూలై 8న కోల్కత్తాలో జన్మించారు. టెస్ట్ కేప్టెన్‌గా భారత్‌కు పలు విజయాలు అందించారు. ఎడమ చేతితో బ్యాటింగ్, కుడిచేత్తో మీడియం పేస్ బౌలింగ్ చేయగల గంగూలీకి బెంగాల్ టైగర్, కోల్కత్తా యువరాజు, దాదా అనే ముద్దుపేర్లు ఉన్నాయి. 2002 నుంచి 2005 వరకు భారత టెస్ట్ జట్టుకు నాయకత్వం వహించి అత్యధిక టెస్ట్ విజయాలు అందించిన కేప్టెన్‌గా రికార్డు సాధించారు. 2003 వరల్డ్‌కప్ క్రికెట్‌లో ఫైనల్ చేరిన భారతజట్టుకు నాయకుడు ఆయనే. 2006 ప్రారంభంలో జట్టునుంచి దూరమైనా డిసెంబరులో మళ్లీ జట్టులోకి ప్రవేశించి 2006-07 దక్షిణాఫ్రికా పర్యటనలో తన ప్రతిభను నిరూపించుకున్నారు. 2008లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యారు. కాగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్‌కు ఐదేళ్లు, 2019 నుంచి 2022 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశారు. పద్మశ్రీ, అర్జున అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్‌లకు సంబంధించి ఏర్పాటైన జస్టిస్ ముద్గల్ కమిటీ ప్రోబ్‌ప్యానెల్‌లో సభ్యుడిగా సుప్రీంకోర్టు నియమించింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డీ.హీరేహాళ్, జూలై 7: మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో గల హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారికి చెందిన మహబూబ్‌బాషా(22), అతని స్నేహితుడు అనిల్‌కుమార్ ఆదివారం బైక్‌పై షికారు కోసం ఓబుళాపురం గ్రామానికి వచ్చారు. కొద్దిసేపు అనంతరం తిరిగి బళ్లారికి బయలుదేరారు. ఓబుళాపురం గ్రామ సమీపంలో ఉన్న బళ్లారి - బెంగుళూరు హైవేలో మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. ప్రమాదంలో మహబూబ్‌బాషా బాషాకు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్‌కుమార్‌కు తీవ్రగాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహబూబ్ బాషా మృతదేహాన్ని కూడా పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన నృత్యరూపకం

పుట్టపర్తి, జూలై 7: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన 'అవతారవైభవంలో ఆదిపర్వం' నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. సంగారెడ్డి జిల్లా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజూ కొనసాగాయి. అవతారవైభవంలో ఆదిపర్వం పేరిట ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను మైమరపింపజేసింది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులు దరఖాస్తు చేసుకోండి

కదిరిఅర్బన్, జూలై 7: జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2023-24 విద్యాసంవత్సరంలో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కదిరి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు తాము పనిచేసిన కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు అందించాలన్నారు. ఈనెల 15న కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఒకే కళాశాలలో 5 సంవత్సరాలు పనిచేసిన వారికి బదిలీలు ఉంటాయని వెల్లడించారు.

డెంగీ నియంత్రణకు సహకరించండి

శిడ్లఘట్ట, జూలై 7: ప్రాణాంతకంగా మారుతున్న డెంగీ జ్వర నియంత్రణకు అందరి సహకారం అవసరమని తహసీల్దార్ బీఎన్ స్వామి అభిప్రాయపడ్డారు. నగరసభ వద్ద డెంగీ జ్వర నియంత్రణకు ప్రత్యేక జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా లార్వా నాశనం చేసేందుకు సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో పౌరకార్మికుల సేవలు అభినందనీయమన్నారు. ప్రజలు తమ ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. టైర్లు, టెంకాయ చిప్పలు, ప్లాస్టిక్ బాటిల్, పెంకులు తదితర వాటిలో నీరు నిల్వకాకుండా చూడాలన్నారు. తద్వారా దోమలు ప్రబలే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ నారాయణ్, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి, బీఈఓ నరేంద్రకుమార్, నగరసభ కమిషనర్ మంజునాథ్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి జగదీశ్, ఆరోగ్యశాఖ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



డెంగీ జ్వర నియంత్రణ జాతాలో తహసీల్దార్ తదితరులు

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మరోసారి శ్రీధర్ ఎన్నిక

బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్ ఆఫ్ బెంగళూరు అధ్యక్షుడిగా మరోసారి ఆర్ శ్రీధర్ ఎన్నికయ్యారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ పదాధికారుల ఎన్నికలు కోలాహలంగా జరిగాయి. సభ్యులు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 2 వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం లెక్కింపులు జరిపారు. అధ్యక్షులుగా ఆర్ శ్రీధర్, ఉపాధ్యక్షులుగా మోహన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్ బెళ్ళితట్టి, కార్యదర్శిగా మంజునాథ్ జివై, జాయింట్ సెక్రటరీగా ధరణీశ్ బి.ఎన్, కోశాధికారిగా గణేశ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శివణ్ణ, యాసిర్ ముస్తాక్, శరణబసప్ప, ముంతాజ్ అలీమ్, రోహిణి వి అడిగ, సి.ఆర్.మంజునాథ్, మహిళా రిజర్వు స్థానం నుంచి మినీ తేజస్వి రెండోసారి గెలుపు సాధించారు. రెండేళ్లపాటు వీరి కార్యవర్గం కొనసాగనుంది.



ప్రెస్‌క్లబ్ నూతన పదాధికారులు



హోమం నిర్వహణలో రుత్వికులు

ఘనంగా అరుణ హోమం

చింతామణి, జూలై 7: లోకకల్యాణార్థం పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠం ఆవరణలో అరుణహోమం రెండు రోజులపాటు ఘనంగా జరిగింది. వేదబ్రహ్మ సి.ఎస్. అనంతాచార్ ఆధ్వర్యంలో స్థాపించిన అగ్నిగుండం చుట్టూ రుత్విక్కులు మంత్రాలను పఠించారు. గురుప్రార్థన, గణ ఎతిపూజ, ప్రసన్న దేవతాపూజ, అరుణపూజ, ఛాయాఉషాసంజ్ఞా సమేత సూర్యనారాయణ పూజ, త్రిచకల్ప విధాన అరుణ ఆదిత్య హృదయ సూర్యాష్టకం, సూర్యనమస్కారాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయహోమం, నక్షత్ర హోమం, సుదర్శన హోమం, పర్జన్యహోమం అనంతరం అరుణహోమం పూర్ణాహుతితో పూర్తి అయ్యింది. తాలూకా బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో దక్షణామ్నాయ శృంగేరి శారదాపీఠాధిపతి ఉభయ జగద్గురు అనుగ్రహంతో ఉడుపి పలిమారు మఠాధిపతి, చింతామణి గురు రాఘవేంద్ర స్వామి సేవా ట్రస్టు గౌరవాధ్యక్షులు విద్యాధీశ తీర్థ నేతృత్వంలో కార్యక్రమాలు సాగాయి. వేదబ్రహ్మ లక్ష్మణశర్మ, ఘనాపాఠి వి.ఆర్.రమేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. అరుణ పారాయణ హోమం ద్వారా అరుణ దేవుడిని పూజించడం ద్వారా ఆరోగ్య, ఐశ్వర్యం లభిస్తాయని సంఘం అధ్యక్షుడు ఎన్ కృష్ణ తెలిపారు.

115 మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటోలు

బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హెర్బాలైఫ్, శిశుమందిర సంయుక్త ఆధ్వర్యంలో ఎకో వీల్స్ ఉమెన్స్‌లో భాగంగా 115మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ చేసినట్టు హెర్బాలైఫ్ సంస్థ ఎండీ అజయ్‌ఖన్నా తెలిపారు. మహదేవపురలో ఎమ్మెల్యే మంజుళా, శిశుమందిర వ్యవస్థాపకురాలు డాక్టర్ హెల్గా ముండ్రా పాల్గొన్నారు. అజయ్‌ఖన్నా మాట్లాడుతూ మహిళా సాధికారతలో భాగంగా స్వశక్తితో మహిళలు ఎదగాలని ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ చేశామన్నారు. మహిళలతోపాటు మంగళముఖిలు సొంతంగా జీవనం సాగించేలా తోడ్పాటు అందిస్తామన్నారు. శిశుమందిర డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ఇ-ఆటో ప్రాజెక్టు పేదరికంలో ఉండే వారికి దారి దీపం కావాలన్నారు. ఈ ప్రయాణాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించదలిచామన్నారు. మహిళలకు ఇ-ఆటోలతోపాటు కార్లు నడిపేలా శిక్షణలు ఇస్తున్నామన్నారు. ఏడాదికి వందమంది మహిళలను సాధికారత దిశగా తీసుకెళ్తున్నామన్నారు. 50మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పేందుకు 5 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 150 ఆటోలను కొనుగోలు చేయదలిచా మన్నారు. గతంలో నెలవారీ 10వేల రూపాయలతో జీవనానికి అనుకూలంగా ఉండేదని ప్రస్తుతం రూ.30వేలు సంపాదించేలా చైతన్యం కల్పిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రికల్ ఆటోలు అందిస్తున్నామన్నారు. రానున్న ఐదేళ్లలో 750మందికి పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని లక్ష్యం కలిగినట్టు తెలిపారు.



లబ్ధిదారులతో నిర్వాహకులు, అతిథులు

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



స్కాలర్‌షిప్‌ల పంపిణీలో ఆలయ ట్రస్టు పదాధికారులు, ముఖ్యఅతిథులు

బొమ్మనహళ్ళి, జూలై 7: అరికెరెలోని శాంతిధామలో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయానికి అనుబంధంగా సాయిసంతోషిమాతా చారిటబుల్ ట్రస్టు, సాయి సేవారక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆదివారం పంపిణీ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన ఒకటో తరగతి నుంచి బిఇ వరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్టు ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం 80శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా విద్యను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా 295మందికి గాను ఆదివారం 261మంది విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ప్రశంసాపత్రం అందజేశామన్నారు. ముఖ్యఅతిథులుగా క్యాండోర్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేతలు సురేశ్, నరేశ్‌లు పాల్గొని స్కాలర్‌షిప్‌లు అందజేశారు. సుమారు 10 లక్షల రూపాయలను స్కాలర్‌షిప్‌ల రూపంలో పంపిణీ చేసినట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం ఎంతో ఉందని వీరిలో నరేశ్, సురేశ్‌లు కూడా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎం.వి.రెడ్డి, తాతయ్యగుప్త, వెంకటేశ్‌గుప్త, కృష్ణయ్యశెట్టి, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

కర్ణాటక చాయారత్న పురస్కారాల ప్రదానం

దొడ్డబళ్లాపుర, జూలై 7: తాలూకా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం మాజీ అధ్యక్షుడు అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ జి.రాజుకు 'కర్ణాటక చాయారత్న' పురస్కారంతో సత్కరించారు. కర్ణాటక వీడియో అండ్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అండ్ బైసెల్ ఇంటరాక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఏర్పాటైన ఫోటో టుడే వస్తు ప్రదర్శనలో కర్ణాటక చాయారత్న పురస్కారాన్ని రాజుకు సినీనటుడు ప్రథమ్ అందజేసి అభినందించారు. మొత్తం ఏడుగురు మహిళా ఫోటోగ్రాఫర్‌లు సహా 52మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. బుల్లితెర నటుడు విక్రమ్ సూరి, సినిమాటోగ్రాఫర్ జిజి కృష్ణ, నికాన్ సంస్థ ముఖ్యులు సజ్జన్, కేవీపీఏ అధ్యక్షుడు బెంజమిన్, పదాధికారులు కృష్ణప్ప, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. దొడ్డబళ్ళాపుర పట్టణ శివారులోని బాశెట్టిహళ్ళిలో మంజునాథ్ స్టూడియో యజమాని జి.రాజు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగంలో అందించిన సేవలకు కర్ణాటక చాయారత్న పురస్కారాన్ని అందజేశారు. రాజు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఫోటోగ్రఫీని నేర్పించిన గురువులకు, వినియోగదారులకు ఈ పురస్కారాన్ని అర్పిస్తున్నట్టు తెలిపారు.



కర్ణాటక చాయారత్న పురస్కారాలతో గ్రహీతలు తదితరులు

ప్రజాసేవ లక్ష్యంగా బోత్ర ఫౌండేషన్

బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బోత్ర ఫౌండేషన్ నిరంతరంగా ప్రజాసేవ లక్ష్యంగా కొనసాగిస్తోందని మేనేజింగ్ ట్రస్టీ సీపీ బోత్ర అభిప్రాయపడ్డారు. నగరంలో ఆదివారం ఫౌండేషన్ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక స్మరణ సంచిక విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ బోత్ర మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన చందన్‌మల్లి బోత్ర ప్రజలకు ఆరోగ్యసంరక్షణలో సేవలందించాలని ట్రస్టు ఏర్పాటు చేశారన్నారు. మధుమేహం, ఆర్థోపెడిక్, ఇఎన్‌టి, ఫిజియోథెరపీ వంటి సేవలు కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 18వేలకుపైగా కంటి శుక్ల ఆపరేషన్‌లు, 14వేల గ్లుకోమా చికిత్సలు జరిపించామన్నారు. మధుమేహ నియంత్రణకు దాదాపు 2లక్షలమందికి సేవలందించామన్నారు. డయాబెటిక్ ఫుట్‌కేర్ ప్రోగ్రామ్ వందశాతం విజయవంతమైందన్నారు. ఫౌండేషన్ మెడికల్ సెంటర్‌తో పాటు నిపుణులైన వైద్యుల సహకారంతోనే సాధ్యమైందన్నారు. సెంటర్ ఫర్ డయాబెటిస్‌తోపాటు ప్రముఖ ఆసుపత్రుల వైద్యుల సహకారం ఉందన్నారు. ఫౌండేషన్‌కు సహకరించినవారిని పలువురిని సత్కరించారు.

ఉత్సాహంగా కళాశాల స్నాతకోత్సవం

బొమ్మనహళ్ళి, జూలై 7: ఎలక్ట్రానిక్‌సిటీలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బెంగళూరు (ఐఐఐటీబీ) 24వ వార్షికోత్సవం, స్నాతకోత్సవం కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఒకే వేదికపై తల్లీ కుమారులు పట్టాలు అందుకోవడం విశేషం. ముఖ్యఅతిథులుగా కేంద్రప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరండికర్, నాస్కామ్ అధ్యక్షులు దేబ్జాని ఘోష్‌లు పాల్గొన్నారు. ఐఐఐటీబీ పాలకమండలి అధ్యక్షుడు, పద్మభూషణ్ గ్రహీత క్రిస్ గోపాలకృష్ణన్, ఐఐఐటీబీ డైరెక్టర్ ప్రొఫెసర్ దేబబ్రతదాస్ అధ్యక్షత వహించారు. ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ఆఫ్ టెక్నాలజీలో 121మంది, మాస్టర్ ఆఫ్ టెక్నాలజీలో 174మంది, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ డిజిటల్ సొసైటీ ప్రోగ్రామ్‌లో 14మంది, మాస్టర్ ఆఫ్ సైన్స్ బై రీసెర్చ్‌లో 23, ఇంకా 11మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. బంగారుపతకాలు సాధించిన విద్యార్థులను ప్రొఫెసర్ దేబబ్రతదాస్ అభినందించారు. బ్లాక్‌చెయిన్, ఏఐ లార్జ్‌లాంగ్వేజ్ మోడల్స్, వీఎల్ఎస్ఐ, సాఫ్ట్‌వేర్ రంగాలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించారని ప్రశంసించారు. తల్లి రంజి నిరంజన్ పీహెచ్‌డీ అందుకోగా కుమారుడు రాఘవ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ అందుకున్నారు. స్నాతకోత్సవంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పట్టాల ప్రదానంలో ప్రముఖులు

వైభవంగా ప్రథమ దర్శనం



స్వామివారి ప్రథమ దర్శనం చూపిస్తున్న దృశ్యం

ప్రారంభమైన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

నార్పల, జూలై 7: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం వైభవంగా జరిగింది. కుళ్లాయి స్వామి పీరును పెట్టెలో నుంచి బయటకు తీసి పసుపు, గంధం, పన్నీరు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రథమ దర్శనం కావడంతో తాడిమర్రి, యల్లనూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, బత్తలపల్లి, తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గూగూడుకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి శోభా, దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడి బ్యాగులో బాంబు ఉందంటూ ఉత్తుత్తి ఫోన్

- యువతిపై విమానాశ్రయం అధికారుల కేసు

బెంగళూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ముంబైకు వెళ్తున్న ప్రయాణీకుడి బ్యాగులో బాంబు ఉందంటూ ఫోన్‌కాల్ చేసిన యువతి చిక్కుల్లో ఇరుక్కున్నారు. 29ఏళ్ల యువతి జూన్ 26న బెంగళూరు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ఫోన్ చేశారు. ముంబైకు వెళ్తున్న ఓ వ్యక్తి బ్యాగులో బాంబు ఉందని వెంటనే అడ్డుకోవాలని ఫోన్‌కాల్ చేశారు. అప్రమత్తమైన ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ప్రయాణీకుడు మీర్‌రాజ్ మెహదిని అడ్డుకున్నారు. అతడి బ్యాగును స్వాధీనం చేసుకుని ప్రత్యేకంగా పరిశీలనలు చేశారు. అతడి బ్యాగులో ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీంతో ఫోన్‌కాల్ చేసిన యువతికోసం కస్టమ్స్ అధికారులు గాలింపులు జరిపారు. ఫోన్ చేసిన యువతి పూనెకు చెందిన ఇంద్రా రాజ్వార్‌గా గుర్తించారు. ఇంద్రా, మీర్‌రాజ్‌లు మిత్రులు కాగా ముంబైకు వెళ్లేందుకు వేర్వేరు విమానాల్లో సీట్లు రిజర్వు చేసుకున్నారు. సాయంత్రం ఎయిర్‌పోర్ట్‌లో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మీర్‌రాజ్‌ను ఎలాగైనా ఇరికించాలని అతడు ముంబైకు వెళ్లకుండా అడుకోవాలని ఫోన్ చేశారు. వెంటనే మీర్‌రాజ్‌ను అడ్డుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఆ తర్వాత ఇంద్రాపై ఐపీసీ 505 (1)(బి) సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రస్తుతం ఇంద్రా పోలీసు కేసులను ఎదుర్కొంటున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ



ట్రస్టు పదాధికారులు తదితరులు

దొమ్మసంద్ర, జూలై 7: ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభావంత విద్యార్థులకు అభినందన, జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు పొందిన సర్దార్‌వల్లభాయ్ పటేల్, న్యూ ఆక్స్‌ఫర్డ్ స్కూల్, సెయింట్ ఫిలోమినా విద్యాసంస్థ, న్యూమెకాలె ఇంగ్లిష్‌స్కూల్, సర్జాపుర ప్రభుత్వ హైస్కూల్, కూగురు హస్కూరు స్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహకధనం అందచేశారు. కార్య క్రమానికి ట్రస్టు అధ్యక్షుడు వై శ్రీరాములు అధ్యక్షత వహించారు. తొలుత అంబేడ్కర్ క్రీడామైదానంలోని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో 2వేలమందికి కలికా సామగ్రి వితరణ చేశారు. కార్యక్రమంలో సర్జాపుర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.జి.నవీన్‌కుమార్ రిటైర్డు సైనాధికారి కేప్టెన్ ప్రకాశ్‌రెడ్డి, బీఈఓ జి.ఎం.జయలక్ష్మి, జడ్పీ మాజీ సభ్యురాలు సుజాత నాగరాజు, సెయింట్ ఫిలోమినాస్ విద్యాసంస్థ సంస్థాకులు వి చంద్రయ్యనాయుడు, రాష్ట్ర పురస్కార గ్రహీత ఉపాధ్యాయుడు డాక్టర్ రవీంద్రరెడ్డి, సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్వై శంభయ్య, శ్రీనివాస్ బుడగప్ప, జాతీయ యువ పురస్కార గ్రహీత డాక్టర్ చిన్నపప్ప వై చిక్కహాగడె, సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సునిత శశిధర్, ఉపాధ్యక్షుడు ఎ.సతీశ్‌కుమార్, ట్రస్టు పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చూపిన పోలీసులు

బంగారపేట, జూలై 7: బంగారపేట - కోలారు మెయిన్ రోడ్డు మార్గంలో ఎస్ఎన్ సిటీ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు ఒకరు తిండితిప్పలు లేకుండా ఉండడాన్ని గుర్తించారు. స్థానిక పోలీసులు అస్లాంపాషా, శ్రీనివాస్‌లు వృద్ధుడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు అందేలా చేసి మానవత్వం చాటుకున్నారు. పోలీసుల కార్యవైఖరిపై స్థానికులనుంచి ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీమోర్చా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్ మాట్లాడుతూ పోలీసులు ఇలా బాధ్యతాయుతంగా వ్యవహరించడం అభినందనీయమన్నారు.

తగ్గిన టమోటా ధర

అనంతపురంరూరల్, జూలై7: కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరలు తగ్గాయి. గత నాలుగైదు రోజులు కిలో గరిష్ఠ ధరలు రూ.35 పైన పలుకుతూ వచ్చాయి. ఆ ధర ఆదివారం రూ.30కి పడిపోయింది. అలాగే కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.18తో పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డుకార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మొత్తంగా మార్కెట్‌లోని మండీలకు 60టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.



తుంగభద్ర పరవళ్లు

- ఒక్కరోజులోనే ఐదు టీఎంసీల నీరు చేరిక
- టీబీ డ్యాంకు పోటెత్తిన సందర్శకులు



నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర డ్యాం

బళ్లారి సిటీ, జూలై7: తుంగభద్ర జలాశయ పరివాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు పడుతుండడంతో టీబీ డ్యాంలో ఒక్కరోజులోనే ఐదు టీఎంసీల నీరు చేరింది. గత రెండు రోజులుగా తుంగభద్రకు వరద ఉధృతంగా వస్తుండగా, ఆదివారం నీటి ప్రవాహం 45వేల క్యూసెక్కులు దాటింది. తుంగభద్ర జలాశయం పూర్తి నీటి మట్టం 1663 అడుగులు కాగా ప్రస్తుతం అది 1597.31 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వసామర్థ్యం 105 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.249టీఎంసీల నీరు చేరింది. గడిచిన 24గంటల్లో జలాశయంలోకి 50,715 క్యూసెక్‌ల నీరు చేరుతుండగా 263క్యూసెక్‌ల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నిండుతుందన్న సంకేతాలు రావడంతో తుంగభద్ర జలాశయాన్ని నమ్ముకున్న రైతులు సైతం సంతోషంగా ఉన్నారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సముద్రంలాంటి జలాశయాన్ని వీక్షించడానికి జనం పోటెత్తారు.

రెండు పంటలు పండుతాయని రైతుల ఆనందం

సిరుగుప్ప : ఈ యేడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో రెండు పంటలు పండించవచ్చునని ప్రజలు ఆశాజనకంగా ఎదురుచూస్తున్నారు తుంగభద్రనదికి ఆనుకున్నంతవరకు భూముల్లో వర్షపునీరు చేరుతుండడంతో సిరుగుప్ప తాలుకాలో ఈ యేడాది రెండు పంటలు పండుతాయంటున్నారు. దీంతో కాలువలకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారా అని రైతులు నిత్యం ఎదురుచూస్తున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,597.31	1,576.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	50,715	302
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	263	249
సామర్థ్యం (టీఎంసీలు)	18.25	3.08

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రాజేశ్



లయన్స్ క్లబ్ సభ్యులతో కొత్తగా ఎన్నికైన రాజేశ్

బళ్లారి సిటీ, జూలై 7: లయన్స్ క్లబ్ కంటోన్మెంట్ ఆఫ్ బళ్లారి నూతన అధ్యక్షుడిగా రాజేశ్, కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా సూరజ్మల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ ఆవరణలో జనిగిన కార్యక్రమంలో 2024-25 సంవత్సరానికి గాను ఆదివారం నూతన పదాధికారుల ప్రమాణ స్వీకారం జరిగింది. జోనల్ ఛైర్ పర్సన్ రాజశేఖర్ లయన్స్ క్లబ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సీనియర్ లయన్స్ సభ్యులు రాధాకృష్ణన్ క్లబ్ సేవలను వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సింధిల్‌కుమార్, శ్రీలతరావు, జవేరీలాల్, భరత్, షణ్ముక, సుధాకర్, నూతన సభ్యులు నాగరాజారెడ్డి, శంకర్, వెంకటేశ్, శివకుమార్ తదితరులు అధ్యక్షులు రాజేశ్ కు స్వాగతం పలికి సన్మానించారు.

నా జన్మదినం.. సేవాదినం



పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, జూలై 7: 'విందులు, వినోదాలతో విలాసంగా వైభవంగా పుట్టిన రోజు పండుగ జరుపుకోవచ్చు. కాని నా జన్మదినాన్ని ఆదివారం సేవాదినంగా జరుపుకుంటాను.' అని అమరేంద్రనాథ్ చౌదరి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు కాయకష్టం చేసి అలసిసొలసిన కష్టజీవులకు ప్రేమతో పట్టెడన్నం పెట్టి వారి చల్లని దీవెనలు పొందటం మహాద్భాగ్యం అన్నారు. ఆకలితో ఉన్న అన్నార్తులకు అన్నప్రసాదం పెట్టడం కోట్ల పుణ్యక్షేత్రాలు దర్శించి సేవించటం కన్న మిన్న అన్నారు. ఈసందర్భంగా పలువురికి అన్నదానం చేశారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.43 లక్షలు



హుండీ నగదుతో ఆలయ కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ, జూలై 7: బళ్లారి నగరవాసుల ఆరాధ్య దేవత కనకదుర్గమ్మ ఆలయంలోని ఐదు హుండీల నుంచి గత నాలుగు నెలల్లో రూ.43 లక్షల నగదు, 3.4 కిలోల వెండి, 85 మిల్లీగ్రాముల బంగారం సమకూరినట్లు ఆలయ అధికారి హనుమంతప్ప తెలిపారు.


ఫ్లైఓవర్‌ను ఏర్పాటు చేయండి



హగరి బొమ్మనహళ్లి రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

కంప్లి, జూలై 7 : విజయనగర జిల్లా హగరి బొమ్మనహ ళ్లిలో నడిబొడ్డున వుండే హోస్పేట-హరిహర రైల్వే మార్గంపై ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని సంఘ సంస్థ నేతలు, ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ ఫ్లైఓవర్ లేకపోవడం వల్ల ప్రయాణికులు వచ్చిన సమయంలో రైల్వే గేటు పడటం వల్ల సుమారు 30 నిమిషాల మేర వేచివుండాల్సి వస్తోంది. ఈ దారిలో వెళ్లే రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కనుక ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంజనాద్రి బెట్టకు పోటెత్తిన భక్తులు



కంప్లి, జూలై 7 : కిష్కింధలోని అంజనాద్రి పర్వతానికి శని, ఆదివారాలు రెండు రోజులపాటు భక్తులు పోటెత్తారు. ప్రకృతి అనుకూలించి, చిరుజల్లులు పడుతుండటంతో నలుమూలల నుంచి భక్తాదులు ద్విచక్రవాహనాలు, కార్లలో కిష్కింధకు చేరుకుని అక్కడున్న దుర్గమ్మదేవి ఆలయం, పంపాసరోవర విజయలక్ష్మీ ఆలయం, సుగ్రీవ పర్వతం, ఉలిగమ్మదేవి ఆలయంతో పాటు అంజనాద్రి దేవాలయాలను దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నలుమూలల నుంచి భక్తాదులు రావడంతో ఆ ప్రాంతం రద్దీగా మారింది. వారితో పాటు విదేశీయులు కూడా పోటెత్తారు.

యంత్రాలతోనే సులువుగా కలుపుతీత



యంత్రంతో కలుపు తొలగిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థి అజ్జయ్య

కంప్లి, జూలై 7 : ప్రతి రైతు యంత్రాలతోనే కలుపు సేద్యం చేపట్టుకోవచ్చునని అజ్జయ్య తెలిపారు. హూవిన అడగళి తాలుకాకు చెందిన ఎంటెక్ చదివిన అజ్జయ్య తన రెండు ఎకరాలలో పనిముట్లు ఏర్పాటు చేసుకుని తానే సొంతంగా కలుపు సేద్యం చేపడుతున్నారు. ఈ విషయంపై అజ్జయ్యను విచారించగా ప్రతి ఒక్కరు చదువుతారని, కానీ రైతుపరంగా ముందుకొచ్చి సేద్యంలోను, కలుపుతీయడంలోను, విత్తనం నాటడంలోను రైతులకు అవగాహన కల్పిస్తే మరెంతో అనుకూలిస్తుందని తెలిపారు. తాను చదివిన చదువులకు, చేస్తున్న శిక్షణకు ముందుకొచ్చి తమ వంతుగా పనిముట్లు ఏర్పాటు చేసుకుని సేద్యం చేపట్టి తమ కుటుంబానికి అండగా వున్నామన్నారు. ఇప్పటికే విపరీతమైన కూలీ రేట్లతో కూలీలు దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో తానే సొంతంగా సైకిల్ చక్రాలతో ఒక యంత్రాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా కలుపు తీసే యంత్రాన్ని తయారు చేసి సేద్యం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి వ్యవసాయంపై అవగాహన పొంది ముందుకు రావాలని సూచించారు.

ఇంటింటి సమస్యలపై జిల్లాధికారి ఆరా



మరెమ్మనహళ్లిలో ఇంటింటా సమస్యలపై ఆరా తీస్తున్న జిల్లా అధికారి దివాకర్

కంప్లి, జూలై 7 : విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ రెండు రోజులుగా ప్రజలకు అందుతున్నసౌకర్యాల గురించి సొంతంగా ఆరాతీస్తున్నారు. మరమ్మనహళ్లి, హగరి బొమ్మనళ్లి పట్టణాల పరిధిలోని గ్రామాలలో పర్యటిస్తూ ప్రభుత్వం ద్వారా వచ్చే సదుపాయాలు అందుతున్నాయా? లేదా? అధికారులు, సిబ్బంది స్పందిస్తున్నారా? తదితర అంశాలపై ఇంటింటికీ వెళ్లి సమస్యలను ఆరా తీశారు. ఆదివారం కూడా మరెమ్మనహళ్లిలో సైకిల్‌పై తిరుగుతూ వివిధ సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం ద్వారా వచ్చే రూ. రెండువేలు, రేషన్ డబ్బులు, పింఛన్ డబ్బులు, వివిధ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒక పని అప్పగించినప్పుడు సిబ్బంది, అధికారులు, సక్రమంగా విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు పొందుతారన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే చ ర్యలు తప్పవన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం

కంప్లి, జూలై 7 : ప్రతిఒక్కరు తమ ఇళ్ల ముందు మొక్కలు నాటుకుని పరిసరాలను పరిరక్షించుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని సీఐ వాసుకుమార్ తెలిపారు. కంప్లి పోలీస్ స్టేషన్ ఆవరణంలో తాను ముందుకొచ్చి పోలీస్ స్టేషన్ ఆవరణమంతా పచ్చదనంతో నింపి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను ఆకట్టుకునేలా చర్యలు చేపట్టారు. ఎన్నో బాధలతో వచ్చే ఫిర్యాదుదారులు ప్రకృతిని చూసి పులకించి తమ ప్రాంతంలోని తమ ఇళ్ల చుట్టూ పొలాల గట్టుపైనా మొక్కలు నాటి పచ్చదనం పెంచేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ గతంలో కుడితిని పట్టణంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పడిన సమయంలో అక్కడున్న ఫ్యాక్టరీల ద్వారా వచ్చే దుమ్ముధూళిని దృష్టిలో వుంచుకుని పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచే ఏర్పాటు చేశామన్నారు. ఆ స్టేషన్ ఇప్పటికీ పచ్చదనంతో నిండి వుంటుందన్నారు. ప్రతి ఒక్కరు దానిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు, రైతన్నలు, విద్యార్థినీ విద్యార్థులు మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని కోరారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో చెట్లను పరిశీలిస్తున్న సీఐ

పీడీ హళ్లిలో రోడ్డు పనులు వేగవంతం చేయండి

బళ్లారిరూరల్, జూలై 7 : తాలుకాలోని పీడీ హళ్లి గ్రామంలో ఎన్‌హెచ్ 63 రోడ్డు పనులు వేగవంతం చేయాలని వాహనదారులతో పాటు పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ రోడ్డు పనుల వలన ఎందరో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతూ కాళ్లు చేతులు విరిగి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రోడ్డు సమస్యలతో వాహనదారులకు కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.



పీడీహళ్లి రోడ్డుపై రద్దీగా వున్న వాహనాలు

పేదలకు అండగా మాజీ మంత్రి శ్రీరాములు



కూల్చిన ప్రాంతంలో తిరిగి గుడిసెలు వేయిస్తున్న మాజీమంత్రి

బళ్లారిరూరల్, జూలై 7 : బళ్లారి నగరంలోని తాళూరు రోడ్డు 24వ వార్డులో శ్రీనగర్ పిల్ల కాలువపై వేసిన ఎనిమిది గుడిసెలను గత నెల 28వ తేదీ తహసీల్దార్ పలు అధికారులు దగ్గరుండి తొలగించారు. దీంతో పేద కుటుంబాలకు చెందిన వారు మాజీమంత్రి శ్రీరాములు ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలియజేయడంతో వెంటనే మాజీ మంత్రి శ్రీరాములు ఆ ప్రాంతానికి వెళ్లి పేద ప్రజల సమస్యలను తెలుసుకుని అండగా వుంటానని హామీ ఇచ్చారు. ఎక్కడైతే గుడిసెలను పడగొట్టారో అక్కడే తిరిగి గుడిసెలు వేయించారు. అధికారులు పిల్లకాలువపై వేసుకున్న గుడిసెలను పేద కుటుంబాలని కూడా చూడకుండా, ఆ సమయంలో వారు ఎక్కడికి వెళతారన్న బాధ లేకుండా తొలగించారని మండిపడ్డారు. వెంటనే తహసీల్దార్, రెవెన్యూ, నీరావరి అధికారులకు ఫోన్ చేసి పేద కుటుంబాలకు ఇలా అన్యాయం చేయడం తప్పని వారికి స్థలాలు చూపకుండా గుడిసెలను తొలగించడం తప్పన్నారు. పేదకుటుంబాలకు అండగా తానుంటానని దగ్గరుండి వారి గుడిసెలను మరమ్మత్తులు చేయించారు. ఆయా కుటుంబాలకు రేషన్, నిత్యవసరసరుకులు, దుస్తులు, వంట సామాగ్రి తక్షణమే ఒక వాహనంలో తెప్పించి పేద కుటుంబాలకు అందించి వారికి అండగా నిలిచారు.

కన్నడ భాష ఉనికిని కాపాడుకుందాం

కన్నడ సాహిత్యపరిషత్ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు సిద్దలింగప్ప

పావగడ, జూలై 7 : ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ భాషపట్ల అవగాహన కల్పించి, భాష ఉనికిని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కన్నడ సాహిత్యపరిషత్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ సిద్దలింగప్ప అన్నారు. పావగడ పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఆదివారం కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాలు, మేధావులతో సర్వసభ్య సమావేశం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా కన్నడ భాష ఉనికిని కాపాడుకోవాలని తెలిపారు. ఈనెల 22న సువర్ణ కర్ణాటక జాగృతి రథోత్సవం పావగడకు రానుందని, కన్నడ భాషాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాహిత్యపరిషత్ తాలూకా అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి కోరారు. నాయకులు అంతర్‌గంగ శంక రప్ప, నాగరాజు, మహ్మద్‌ఇమ్రాన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి చికిత్స శిబిరానికి స్పందన

పావగడ, జూలై 7: తాలూకా పరిధిలోని తిరుమణి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం హెల్ప్ సొసైటీ, బెంగళూరి సప్తగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరానికి మంచి స్పందన లభించిం ది. మనిషి అవయవాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని, జాగ్రత్తగా కాపాడు కోవాలని తిరుమణి గ్రామపంచాయతీ అధ్యక్షుడు లోకేష్ చౌదరి సూచిం చారు. తిరుమణి ఆరోగ్య అధికారి రమేష్, డాక్టర్ శ్రీకాంత్, లయ పాల్గొన్నారు.

హోసూరు జోన్

కాలినడకతో వందవాసికి జైనమునులు



పోలీసుల రక్షణలో సాగుతున్న జైనమునులు

హోసూరు, జూలై 7: ఆచార్య సూర్యసాగర్, మునిమహరాజ్ తతిత్ సాగర్ కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి నుంచి బెంగళూరు చేరుకున్నారు. ఆదివారం ఉదయం బెంగళూరుకు వచ్చిన సాధువులు మధ్యాహ్నం అత్తిబెలె మీదుగా కాలి నడకన హోసురుకు చేరుకున్నారు. అత్తిబెలె సరిహద్దు నుంచి తమిళనాడు పోలీసులు దిగంబర సాధువులకు అండగా నిలిచారు. హోసూరు నుంచి కృష్ణగిరి వెళ్లి, అక్కడనుంచి తిరువణ్ణామలై మీదుగా వందవాసి చేరుకుంటామన్నారు. తర్వాత తిరుమల మఠానికి వెళ్లి పొన్నూరు కొండ చేరుకుని అక్కడి విశ్రాంతి తీసుకుంటామని సాధువులు తెలిపారు.

రైల్వే అండర్‌పాస్ పనులు వేగవంతం కావాలి

హోసూరు, జూలై 7: హోసూరు సమీపంలో రైల్వే అండర్‌పాస్ పనుల కారణంగా ట్రాఫిక్ మళ్లించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డెంకణీకోట మార్గంలో రైల్వే అండర్‌పాస్ నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయంగా కొన్ని కిలోమీటర్ల మేర చుట్టి వెళ్లాల్సి వస్తోందని సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కృష్ణగిరి జిల్లా హోసూరులో బెంగళూరు-సేలం మార్గంలో రైలు మార్గాలను రెండు ట్రాక్‌లుగా మారుస్తున్నారు. అదే విధంగా అన్నై నగర్, ఎస్ఎం నగర్, ఆదిత్య నగర్ ప్రాంతాల్లో రైల్వే వంతెనలను మూసివేశారు. ఆ మార్గంలో కూడా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. కావున రైల్వే అండర్‌పాస్ పనులు త్వరగాపూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.వెయ్యి పలుకుతున్న గుండుమల్లె

హోసూరు, జూలై 7: కొన్నిరోజులుగా హోసూరు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పూల దిగుబడి తగ్గింది. దీంతో గుండుమల్లె కిలో రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పలుకుతోంది. బంతి పూల ధర కిలో రూ.250 నుంచి రూ.260 వరకు పలుకుతోంది. సరఫరా తగ్గడమే పూలధరలు పెరగడానికి కారణమని రైతులు అంటున్నారు. హోసూరు పరిధిలోని కెలమంగలం, బాగలూరు, బేరికై, శూలగిరి, డెంకణీకోట, తదితర మండలాల్లో రైతులు సుమారు 3 వేల ఎకరాల్లో చెండుమల్లి, మల్లె, కనకాంబరం, సంపంగి, చామంతి, తదితర పూల సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించే పూలు తమిళనాడులోని వివిధ జిల్లాలతోపాటు పొరుగున ఉండే కర్ణాటక రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు ఎగుమతి కావడం గమనార్హం.

ఐడీబీఐ ఏటీఎంలో చోరీ

హోసూరు(క్రైం), జూలై 7: కృష్ణగిరి జిల్లా హోసూరు - బాగలూరు రహదారిలో ఏర్పాటుచేసిన ఐడీబీఐ ఏటీఎం మిషన్‌ను ఆదివారం గ్యాస్ కట్టర్‌తో పగులగొట్టి దుండగులు దోచుకెళ్లినట్టు తెలుస్తోంది. ఏటీఎం నుంచి సుమారు రూ.14.50 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించారు. డీఎస్పీ బాబుప్రశాంత్, ఏడీఎస్పీ పోలీసు బృందాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికంగా ఈ ఘటనతో కలకలం నెలకొంది. శనివారం రాత్రి ఏటీఎం మెషీన్ నుంచి ఖాతాదారులు డబ్బులు డ్రా చేశారు. ఆ తర్వాత ఐడీబీఐ ఏటీఎం నుంచి ఎలాంటి లావాదేవీ జరగలేదు. దీంతో అనుమానం వచ్చిన బ్యాంకు మేనేజర్ పోలీసులకు సమాచారం అందించడంతో చోరీ జరిగిన విషయం వెల్లడైంది. హోసూరు-బాగలూరు రహదారిలోని బ్యాంకులు, కార్యాలయాల వారంతా ఆందోళన చెందుతున్నారు.



పగలగొట్టిన ఏటీఎం వద్ద పోలీసులు

చిల్లర వివాదంలో కంట్రోలర్‌పై ప్రయాణీకుడి దాడి

రాయచూరు, జూలై 7: చిల్లర కోసం గొడవపడి కండక్టర్ పై చేయి చేసుకోవడంతో, కండక్టర్‌ను విడిపించే ప్రయత్నం చేసిన కంట్రోలర్‌పై ప్రయాణీకుడొకరు దాడికి దిగిన సంఘటన ఇది. జిల్లాలోని సింధనూరు సెంట్రల్ బస్‌స్టాండ్ వద్ద ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకోగా దాడికి దిగిన ప్రయాణీకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి సింధనూరు స్టేషన్‌కు తరలించారు. శివమొగ్గ నుంచి దేవదుర్గకు వస్తున్న బస్సులో కారటగి వద్ద ఇస్మాయిల్ అనే ప్రయాణీకుడు ఎక్కి కండక్టర్‌కు రూ.500 నోటు ఇచ్చాడు. సింధనూరులో దిగాల్సిన అతడికి కండక్టర్ చిల్లర గురించి టికెట్ వెనకభాగంలో రాసిఇచ్చాడు. సింధనూరు చేరుకున్న తర్వాత చిల్లర విషయమై ఆ వ్యక్తి కండక్టర్‌తో గొడవపడ్డాడు. సరైన చిల్లర్ మీరే తెచ్చుకోవాలని కండక్టర్ అనడంతో గొడవకు దిగిన ఇస్మాయిల్, అతడిపై చేయి చేసుకున్నాడు. దీంతో అక్కడికి వెళ్లిన పాయింట్ కంట్రోలర్ శరణప్ప గౌడ వారిని వారించే ప్రయత్నం చేసేలోగా ప్రయాణీకుడు ఆయనపై కూడా దాడికి దిగాడు. ఈ క్రమంలో శరణప్ప ముక్కులో నుంచి రక్తం రావడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇస్మాయిల్ పై కేసు నమోదు చేశారు.



దాడిలో గాయపడిన కంట్రోలర్ శరణప్ప గౌడ

గాయపడిన కంట్రోలర్ శరణప్పను తాలూకా ఆస్పత్రికి పంపించి చికిత్సనందించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కంట్రోలర్